జగనన్న కాలనీ త్వరగా పూర్తిచేయాలి

విశాలాంధ్ర-టంగుటూరు : జగనన్న కాలనీ త్వరగా పూర్తి చేయాలి మండల పరిషత్ కార్యాలయములో బుధవారం మండలంలోని 18 పంచాయతీ కార్యదర్శులకు, ఇంజనీరింగ్ అసి స్టెంట్లకు, వీఆర్వోలకు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తాసిల్దార్ సంజీవరావు మాట్లాడుతూ జగనన్న కాలనీలను లేఔట్లను పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ సమస్యలు ఏమైనా ఉన్నట్లయితే మా దృష్టికి తీసుకొస్తే పరిశీలిస్తామని తెలియజేశారు. తహసీల్దార్ వీఆర్వోలు అసిస్టెంట్లకు పంచాయతీ కార్యదర్శులకు జగనన్న కాలనీలో ఎంతవరకు పని జరిగిందని వీఆర్వోలను త్వరగా వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు వీఆర్వోలు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
ప్రకాశం జిల్లా

పెంచిన విద్యుత్ బిల్లులు నియంత్రించాలని 30న ధర్నా

విశాలాంధ్ర-తర్లుపాడు : మండల కేంద్రమై న తర్లుపాడులోని స్థానిక బస్టాండ్ సెంటర్లోపెంచిన కరెంట్ బిల్లులను తగ్గించాలని ఈ నెల 30వ తేదీన సంబంధింత విద్యుత్తు సబ్ స్టేషన్‌ల వద్ద తలపెట్టనున్న ధర్నాను జయప్రదం చేయాలనీ సీపీఎం జిల్లా నాయకులు గుమ్మా బాల నాగయ్య ప్రచార కార్యక్రమంలో భాగంగా ఆయన పాల్గొని ప్రసంగించారు, స్మార్ట్ మీటర్లు, కరెంట్ చార్జీలు పెంపు, వంటివి ప్రజలకు భారం మోపి కార్పొరేటర్ల జేబులు నింపేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాటుపడుతున్నాయన్నారు. కావున ఈ నెల 30వ తేదీన తర్లుపాడు విద్యుత్ కార్యాలయం వద్ద జరగబోయే ధర్నాను జయప్రదం చేయాలనీ పిలుపు నిచ్చారు ఈ కార్యక్రమంలో సీపీయం నాయకులు ఎరువ పాపిరెడ్డి, నాగరాజు, ప్రజలు బ్రాహ్మరెడ్డి, అల్లూరయ్య, కాకర్ల కాసిం పాల్గొన్నారు.

బాలినేనిని కలిసిన జడ్పీటీసీ దద్దాల

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసులురెడ్డిని మరియు వారి తనయుడు ప్రణీత్‌బాబుతో ఒంగోలు పట్టణంలోని వారి స్వగృహం నందు బుధవారం హనుమంతునిపాడు మండల జడ్పీటీసీ డాక్టర్ దద్దాల నారాయణ,మాజీ జెడ్పీటీసీ బన్నీ, ప్రకాశ్‌రెడ్డిలు మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

అన్న క్యాంటీన్‌లో అన్నదానం

విశాలాంధ్ర-పామూరు : తెలుగుదేశం పార్టీ నాయకులు, వ్యాపారవేత్త పువ్వాడి వెంకటేశ్వర్లు (పెట్రోల్ బంక్), సుజాత దంపతుల కుమారుడు డాక్టర్ పువ్వాడి అభినవ్ మణికంఠ శేషాద్రి జన్మదిన వేడుకలను కుటుంబ సభ్యులు బుధవారం ఘనముగా నిర్వహించారు. నియోజకవర్గ కేంద్రమైన కనిగిరిలో పేదల ఆకలి తీర్చేందుకు జనసీ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్చార్జ్ డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ఆధ్వర్యంలో కొనసాగుతున్న అన్న క్యాంటీన్‌లో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, పువ్వాడి రామారావు, పువ్వాడి వెంకటేశ్వర్లు, సుజాత తదితరులు పాల్గొన్నారు.

నేడు టీడీపీ సమావేశం

విశాలాంధ్ర-వెలిగండ్ల : నేడు టిడిపి కార్యకర్తల సమావేశం వెలిగండ్ల తెలుగుదేశం కార్యాలయంలో నిర్వహించడం జరుగుతుందని మండల అధ్యక్షులు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు కనిగిరి నియోజకవర్గ తెలుగుదేశం ఇంచార్జ్ డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు ఈ సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుందని మండల స్థాయి నాయకులు కార్యకర్తలు హాజరుకావాలని భవిష్యత్తు ప్రణాళికపై చర్చించడం జరుగుతుందని ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

త్యాగనిరతికి ప్రతీక ఈద్-అల్-జుహ

- దారపనేని

విశాలాంధ్ర-పామూరు : ముస్లిం సోదరులు అతి పవిత్రంగా జరుపుకొనే పండుగ ఈద్ అల్ జుహా బక్రీద్ అని దారపనేని చంద్రశేఖర్ తెలిపారు.

త్యాగనిరతికి తార్కాణం ఈ బక్రీద్ పండుగని, ముస్లిం సోదరులు ఇచ్చే ఖుర్బానీ వలన ఎంతో పుణ్యం చేకూరుతుందని, పుణ్య ఫలాలకు మారుపేరు బక్రీద్ పండుగని దారపనేని అన్నారు. నియోజకవర్గంలోని ముస్లిం సోదరులందరూ బక్రీద్ సందర్భాన్ని పురస్కరించుకొని దైవచింతన మార్గం ద్వారా మోక్షం కలుగుతుందని, అందరూ గ్రహించి ఆ అల్లాహ్ కృపకు పాత్రులు కావాలని, ప్రతి ముస్లిం సోదరుడు నమాజు ప్రాశస్త్యం గురించి ఎన్నో రకాలైన పద్ధతులను ఆచరించే విధానం గురించి ఆచరించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని దారపనేని పేర్కొన్నారు.

'జగనన్న సురక్ష సర్వే'పై అవగాహన

విశాలాంధ్ర-తాళ్లూరు : జగనన్న సురక్ష కార్యక్రమం సర్వేను జాగ్రత్తగా ఎలాంటి లోపాలు లేకుండా నిర్వహించాలని గ్రామ సర్పంచ్ మందా శాంసన్ అన్నారు. మండలంలోని బొద్దికూరపాడు గ్రామంలో బుధవారం జనగన్న సురక్ష సర్వేపై అవగాహనతో కూడిన శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు .ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ శాంసన్ మాట్లాడుతూ సర్వే చేయు విధానం, సర్వే వల్ల ప్రజలకు అందించే సేవలు సక్రమంగా జరిగేటట్టు చూడాలని ఆయన తెలిపారు. వాలంటీర్లు తొందరపాటు తనం లేకుండా సర్వే జాగ్రత్తగా నిర్వహించి, ప్రభుత్వం ఆశించిన ఫలితాలు లభించే విధంగా చూడాలని గ్రామ ఉపసర్పంచ్ పులి ప్రసాద్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ఎస్.కె షహనాజ్ బేగం, సచివాలయ ఉద్యోగులు, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష' ప్రజల రక్ష

విశాలాంధ్ర-వెలిగండ్ల : జగనన్న సురక్ష ప్రజలందరికీ లబ్ధి చేకూరుస్తుందని మండల సచివాలయ కన్వీనర్, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు పోల్లా సుబ్రమణ్యం, నాగూర్ యాదవ్ అన్నారు. బుధవారం మండలంలోని ఇమ్మడి చెరువు గ్రామ సచివాలయంలో గృహసారథులు సచివాలయ సిబ్బంది వాలంటీర్లతో జగనన్న సురక్షపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షులు కాకర్ల వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ గురవయ్య సర్పంచి బాలయ్య, ఆదిరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలి

మంత్రి మేరుగు నాగార్జున

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు :

విద్యార్థులు అమ్మ ఒడి లాంటి గొప్ప పథకాలను ఉపయోగించుకుని ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని జిల్లా ఇన్చార్జ్ మంత్రి, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున ఆకాంక్షించారు. బుధవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగో విడత జగనన్న అమ్మ ఒడి విధులను విద్యార్థుల తల్లుల ఖాతాలలో జమ చేసే కార్యక్రమాన్ని కురుపాకంలో ప్రారంభించారు. దీనికి అనుబంధంగా కలెక్టరేట్లోని స్పందన హాలులో రాష్ట్ర మున్సిపల్ మరియు పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, మాదిగ కార్పోరేషన్ ఛైర్మన్ కొమ్మూరి కనకారావు, ఒంగోలు నగర మేయర్ శ్రీమతి గంగాడ సుజాతతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు బ్యాంకు చెక్కును ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మేరుగు నాగార్జున మాట్లాడుతూ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా భావితరాల భవిష్యత్తు కోసం ఈ పథకాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారన్నారు. ఈ దేశానికి చదువు అవసరాన్ని గుర్తించి బాబా సాహెబ్ అంబేద్కర్ ఆలోచనా విధానంతో విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని ఆయన అన్నారు. గతంలో పేద కుటుంబాలలోని విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులు వలన చదువును మధ్యలో ఆపేసే పరిస్థితులను ముఖ్యమంత్రి అవగతం చేసుకుని అమ్మ ఒడి పథకం ద్వారా విద్యార్థుల తల్లుల ఖాతాలలో నగదును జమ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. విద్యార్థులు చదువుకు అవసరమయ్యే మౌలిక వసతులను తీర్చడానికి ఈ నగదు ప్రోత్సాహం ఉపయోగ పడుతుందన్నారు. విద్య కోసం సుమారు రూ.95 వేల కోట్లను వెచ్చించిన ఏకైక ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అని ఆయన చెప్పారు. విద్యా వ్యవస్థలో ఇంత గొప్ప మార్పులు తీసుకువచ్చిన ముఖ్యమంత్రి పేరు సువర్ణ అక్షరాలతో లిఖించ బడుతుందని మంత్రి కొనియాడారు.

మంత్రి ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ అమ్మ ఒడి నాలుగో విడత నగదు తల్లుల ఖాతాలలో జమ చేసే కార్యక్రమంలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. విద్య యొక్క ప్రాముఖ్యతను గుర్తించి కరోనా లాంటి విపత్కర పరిస్థితులలో కూడా ఈ పథకాలు ఆగకుండా కొనసాగించడం గొప్ప విషయమన్నారు. ప్రభుత్వం ఈ ఒక్క పథకానికే సుమారు రూ.26 వేల కోట్లను వెచ్చించిందన్నారు. పేదరికం వల్ల విద్యార్థులు చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో దేశంలో ఎక్కడా లేని విధంగా ఇంత పెద్ద మొత్తంలో విద్యకు ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకుని బాగా చదువుకోవాలని ఆయన ఆకాంక్షించారు. జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ మాట్లాడుతూ అమ్మ ఒడి పథకం కింద జిల్లాలో 2,03,663 మంది తల్లుల ఖాతాలలో రూ.305.49 కోట్లను జమ చేస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఇంగ్లీష్ మీడియం ప్రాముఖ్యతను గుర్తించి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియాన్ని ప్రవేశ పెట్టారన్నారు. డి.ఈ.ఓ. రమేష్, జడ్పీ విద్యాధికారి సామా సుబ్బరావు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో లక్కవరం విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-తాళ్లూరు : ఎస్బిఐ ఆధ్వర్యంలో ప్రకాశం జిల్లా స్థాయిలో జరిగిన క్విజ్ పోటీలలో లక్కవరం గ్రామానికి చెందిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభను చాటారు. జిల్లా స్థాయిలో జరిగిన క్విజ్ పోటీలో జిల్లాస్థాయిలో ప్రతిభను చాటి జిల్లా ప్రథమ ర్యాంకు సాధించి పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఒక్కొక్కరు 5000 రూపాయలు చొప్పున పదివేల రూపాయల ప్రైజ్ మనీ, ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. దీనితోపాటు జూలై నెలలో రాష్ట్రస్థాయిలో జరిగే క్విజ్ పోటీలకు లక్కవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. జిల్లాస్థాయిలో ప్రతిభను చాటి పదివేల రూపాయల ప్రైజ్ మనీ పొంది, ప్రశంసా పత్రాన్ని పొందడంతో పాటు, రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఎంఈఓ 1 జి సుబ్బయ్య, ఎంఈఓ 2 ఎల్ సుధాకర్ రావు, మండలంలోని అన్ని గ్రామాల ఉపాధ్యాయులు, విద్యాధికులు, వారిని అభినందించారు.

ప్రతిష్టాత్మకంగా 'జగనన్న సురక్ష'

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : మండల పరిధిలోని వేములపాడు గ్రామంలో బుధవారం జరుగుతున్న జగనన్న సురక్ష కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న కనిగిరి ఎమ్మెల్యే బుర్ర మధుసూదన్ యాదవ్ ఇంటింటికి తిరుగుతూ ప్రజలు వారి అవసరాలను కనుక్కొని సర్వేల నమోదు చేయించారు. ఎమ్మెల్యే బుర్ర మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అర్హులై ఉండి ఏఒక్కరు లబ్ధి అందకుండా మిగిలిపోకూడదన్న తపనతో ప్రతి ఇంట్లో ఏ చిన్న సమస్య ఉన్న దాన్ని పరీక్షించాలని చిత్తశుద్ధితో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకెళ్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మక కార్యక్రమం జగనన్న సురక్ష అనే రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గాయం సావిత్రి,మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ యక్కంటి శ్రీని వాసులురెడ్డి, సర్పంచ్ భవనం కృష్ణారెడ్డి, సర్పంచ్ సాని కొమ్ము మధుసూదన్ రెడ్డి, తిమ్మారెడ్డిపల్లి వైసీపీ ఇన్చార్జ్ కస్తాల బాలాజీ, మహిళా మండల అధ్యక్షురాలు కస్తాల బేబీ,మాజీ సర్పంచ్ పిచ్చిరెడ్డి, సర్పంచ్ కత్తి రాజారావు,గురు ప్రసాద్,ఆదినారాయణరెడ్డి, మద్ది తిరుపతయ్య, చెక్కా రాములు మరియు సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు,తదితర వైసీపీ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడితే శిక్ష తప్పదు

జిల్లా ఎస్పీ మల్లిక గర్గ్

విశాలాంధ్ర-ఒంగోలు : మహిళలు/యువతిలపై అఘాయిత్యాలు, లైంగిక దాడులు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, మహిళలపై వేధింపులకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లో చట్టం నుండి తప్పించుకునే వీలులేకుండా కోర్ట్ లో సమర్థవంతమైన ట్రయిల్ మానిటరింగ్ ద్వారా నిందితులకు కఠిన శిక్షలు పడే విధంగా కృషి చేస్తున్నామని జిల్లా ఎస్పీ మల్లికగర్గ్ పేర్కొన్నారు. నాగులుప్పలపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో 2022 మార్చి 9వ తేదీన మధ్యాహ్నం సమయంలో ఎన్‌జి పాడు మండలానికి చెందిన మతిస్థిమితం లేని యువతిపై అదే మండలానికి చెందిన తుమాటి తిరుమల స్వామి అనే వ్యక్తి అత్యాచారయత్నానికి ప్రయత్నించిన ఘటనలో ఎన్‌జి పాడు ఎస్సై శశి కుమార్ కేసును నమోదు చేసినారు. ఎస్సై మరియు ఒంగోలు రూరల్ సిఐ ఆర్ రాంబాబు దర్యాప్తు చేపట్టి, నిందితుడుని అరెస్టు చేసి, రిమాండుకు పంపించి, కోర్టులో అభియోగపత్రం దాఖలు చేసారు. తరువాత ముద్దాయిని జిల్లా రెండవ కోర్ట్ అడిషనల్ జడ్జి సోమశేఖర్ ముందు హాజరుపరిచి, తగిన సాక్ష్యాధారాలతో నిందితుడు అత్యాచార యత్నం చేయబోయినట్లు కోర్టులో నేరనిరూపణ అయినందున 2023 జూన్ 27వ తేదీ న నిందితుడుకి 5 సంవత్స రాలు జైలు శిక్ష, రూ.2వేలు జరిమానా విధించారు. ఈ కేసులో కోర్ట్ లో సరైన సాక్ష్యాధారాలతో సమర్ధవంతంగా ట్రయిల్ మానిటరింగ్ చేసి నిందితుడుకి శిక్షపడటంలో క్రియాశీలకంగా పనిచేసిన ప్రస్తుత ఒంగోలు తాలూకా సీఐ ఆర్ రాంబాబు, అడిషనల్ పిపి యత్తపు కొండా రెడ్డి, కోర్ట్ లైజన్ ఏఎస్సై లక్ష్మీనారాయణ, సమన్స్ అమలు పరిచిన నాగులుప్పలపాడు ఎఎస్సై కొండయ్యలను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

టీడీపీ మినీ మేనిఫెస్టోతో వైసీపీలో వణుకు

మాజీ ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి

విశాలాంధ్ర-కనిగిరి : తెలుగుదేశం పార్టీ భవిష్యత్తుకు గ్యారెంటీ పేరుతో చంద్రబాబు నాయుడు ప్రకటించిన మినీ మేనిఫెస్టో తో వైసీపీలో వణుకు మొదలైందని మాజీ ఎమ్మెల్యే తెదేపా ఇంచార్జ్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. బుధవారం కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని శంఖవరం గ్రామంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మినీ మేనిఫెస్టోలో మహిళలు యువత రైతులు బీసీలను ఉపయోగపడే విధంగా రూపొందించిన మహాశక్తి, యువగళం, అన్నదాత, ఇంటింటికి నీరు, బీసీలకు రక్షణ చట్టం, పేద నుండి ధనవంతుడు పథకాలను వివరించారు. ఉగ్ర శంకవరం గ్రామంలో నిర్వహించిన రచ్చబండలో గ్రామస్తులు తాగునీరు, విద్యుత్ సరఫరా, అంతర్గత రహదారులు అధ్వానంగా ఉన్నాయని ఉగ్రకు ఏకరువు పెట్టారు. వైసీపీ ప్రభుత్వం పాలన పగ్గాలు చేపట్టిన తర్వాత గ్రామాల్లో ప్రజలకు మౌలిక వసతులు కరువయ్యాయని అన్నారు. నిత్యవసర వస్తువులు ఆకాశాన్ని అంటుతున్న పాలకులు పట్టించుకోవడంలేదని అన్నారు. ఎమ్మెల్యేగా ప్రజలందరూ ఆశీర్వదిస్తే మున్సిపాలిటీతో పాటు కనిగిరి నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించ దంతో పాటు గ్రామాలను అభివృద్ధి చేస్తానని ఉగ్ర అన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు షేక్ ఫిరోజ్, ఫుల్లారెడ్డి, తమ్మినేని సురేంద్ర రెడ్డి, తిరుపాలు, నజుముద్దీన్ పాల్గొన్నారు.

ఉత్పత్తి సంఘాలతో రైతులకు లబ్ధి

విశాలాంధ్ర-వెలిగండ్ల : ఉత్పత్తి సంఘాలతో రైతులకు లబ్ధి చేకూరుతుందని మండల వ్యవసాయ అధికారి రంగ కృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని మొగులూరు గోకులం పంచాయతీలలోని ఆర్‌బికేల నందు రైతు ఉత్పత్తి సంఘాలతో అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి రంగ కృష్ణ మాట్లాడుతూ రైతులు పది నుంచి పదిహేను ముందు కలిసి ఒక గ్రామంలో 20 గ్రూపులుగా ఏర్పడి ఈ గ్రూపులతో విత్తనాలు నుండి పంట కోత వరకు సాంకేతిక పరిజ్ఞానం సమగ్ర యాజమాన్య పద్ధతులతో రైతుల అవగాహన కల్పించడం, దిగుమతిని పెంచడం మార్కెటింగ్ ఫెసిలిటీ కల్పించి రైతులు ఆర్థికంగా బలపరచడమే ఈ ఉత్పత్తి సంఘాల ముఖ్య ఉద్దేశమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మొగులూరు గోకులం సర్పంచులు మోపురి కోటేశ్వరరావు, చిలకల వెంకట రత్నమ్మ, ఏపిఎం లక్ష్మీనారాయణ, హెచ్ ఓ అంజలి భాయ్, రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షులు పాణ్యం మురళి, ఏవోలు శేషమ్మ శైలజ సీసీలు అచ్చయ్య సునీత, జాపూర్ల, వీఏఏలు ఈశ్వర్ రెడ్డి అజారుద్దీన్ పాల్గొన్నారు.

బాల్యవివాహల నిషేధంపై అవగాహన

విశాలాంధ్ర-పామూరు : మండలంలోని దాదిరెడ్డిపల్లి సచివాలయం పరిధిలోని చిలంకూరు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం బాల్యవివాహల నిరోధక కమిటీ సహకారంతో ప్రకాశం జిల్లా ఎస్‌బిసిసి సెల్, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో విద్య ఆరోగ్యం, బాలికా వికాసం,బాల్య వివాహాల నిషేధ చట్టం 2006, బాల కార్మిక నిషేధ చట్టం,పోక్సో యాక్ట్ 2012 పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్‌బిసిసి సెల్ జిల్లా కోఆర్డినేటర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ చిన్నతనంలోనే పెళ్లిలు చేయడంతో ఎన్నో అనర్థాలు, మనస్పర్థలు ఏర్పడతాయని వివరించారు. యుక్త వయస్సు వచ్చిన తర్వాతే పెళ్లిలు చేయాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు అమ్మాయికి 18, అబ్బాయికి 21సంవత్సరాలు పూర్తయిన తర్వాత పెళ్లి చేయాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా పెళ్లి చేసేందుకు సిద్ధమైతే చైల్డ్‌హెల్ప్ లైన్ 1098,112 ఫోన్ నెంబర్ లకు సమాచారం అందించాలన్నారు. ప్రతీ ఒక్కరూ నైతిక ప్రవర్తన అలవార్చుకోవాలి అని అన్నారు. కార్యక్రమంలో ఇంచార్జి ప్రధానో పాధ్యాయురాలు ఎం జ్యోతి, మహిళా పోలీస్ ఎం. సరోజిని, ఎస్‌బిసిసి సెల్ జిల్లా సభ్యులు గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ రమేష్ బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భారత జీవిత బీమా సంస్థ ఉద్యోగాలకు ఎంపికైన నేతాజి ఇనిస్టిట్యూట్ విద్యార్థులు

విశాలాంధ్ర-మార్కాపురం టౌన్ : భారత జీవిత బీమా సంస్థ మంగళవారం రాత్రి విడుదల చేసిన అప్రెంటీస్ డేవెలప్మెంట్ ఆఫీసర్ ఉద్యోగాల తుది ఫలితాలలో మార్కాపురం పట్టణంలోని నేతాజీ ఇన్స్టిట్యూట్ అఫ్ కాంపిటీటివ్ ఎగ్జామ్స్ (నైస్) శిక్షణ పొందిన ఇద్దరు ఉద్యోగాలకు ఎంపినట్లు నేతాజీ ఇన్స్టిట్యూట్ గౌరవ సలహా దారులు కొత్తేర్వ కాశిరెడ్డి తెలిపారు.

వీరిలో మేడం వెంకటేష్ (రోల్ నంబర్ : 2071000649) జనరల్ కేటగిరీ లో సికింద్రాబాద్ డివిజన్ మరియు బొమ్మన బోయిన శివ (రోల్ నంబర్ :2071005519) నెల్లూరు డివిజన్లలో ఏడీఓ ఉద్యోగాలకి ఎంపికైనారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమం లో విజేతలు మాట్లాడుతూ పట్టు విడవక చేసిన ప్రయత్న ఫలితమే ఈ విజయం అని, దీనికి కారణమైన నేతాజీ అధ్యాపక బృందానికి, ముఖ్యంగా అర్థమెటిక్ మరియు రీజనింగ్ మాస్టర్లు తారక బ్రహ్మం, కాశిరెడ్డిలకు రుణపడి ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం తారకబ్రహ్మం, శేషు, రమణారెడ్డి, గౌతమ్, ఫణింద్రారెడ్డి, ఫణికుమార్, నబి, నాగరాజు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొని ఉద్యోగం సాధించిన వారికి అభినందనలు తెలిపారు.

అంగన్ వాడీ కేంద్రాలను తనిఖీ చేసిన సర్పంచ్

విశాలాంధ్ర-సింగరాయకొండ : గ్రామ పంచాయతీ పరిధిలోని శ్రీరామ్ నగర్, సత్రం బడిలో ఉన్న అంగన్‌వాడి కేంద్రాలను సర్పంచ్ తాటిపర్తి వనజ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పిల్లలకు అందించే పోషక ఆహార పదార్థాలను గుడ్లు, కందిపప్పు, బెల్లం, చిక్కిలు మొదలగు పదార్థాలను స్వయంగా చూసి మెనూ హాజరు పట్టికను పరిశీలించారు. భోజన నాణ్యత మరియు పరిశుభ్రత విషయంలో ఎలాంటి రాజి ఉండకూడదని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం పంచాయతీ బిల్ కలెక్టర్ రామయ్య జాన్ కిషోర్, ప్రణయ్ వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ప్రోటోకాల్‌కు తిలోదకాలు

జిల్లాకు చెందిన మంత్రి, స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ, కలెక్టర్ ఫోటోలు లేకుండా ఫ్లెక్సీలు

విశాలాంధ్ర-ఒంగోలు : జిల్లాలో ప్రోటోకాల్ పాటించకపోవటం ఒక తంతుగా మారింది.ప్రభుత్వ కార్యక్రమాలలో ఏకంగా జిల్లాకు చెందిన మంత్రి ఆదిమూలపు సురేష్, మాజీ మంత్రి ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసులరెడ్డి, స్థానిక ఎంపి మాగుంట శ్రీనివాసులరెడ్డి, కలెక్టర్ ఫోటోలు లేకుండా కేవలం జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి బోత్సా సత్యనారాయణ ఫోటోలు మాత్రమే ప్రింట్ చేయించి కలెక్టర్ కార్యాలయం గేటు వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. వీటిని చూసిన ప్రజలతో పాటుగా వైసీపీ శ్రేణులు విస్తుపోయారు. జిల్లాకు చెందిన మంత్రి ఫోటోతో పాటుగా, స్థానిక ఎమ్మెల్యే ఫోటో లేకపోవటం, స్థానిక ఎంపి మాగుంట శ్రీనివాసులరెడ్డి ఫోటో తో పాటుగా, కలెక్టర్ ఫోటో లేకపోవటం మరింత చర్చకు దారి తీసింది. అయితే ఇది ఇలా జరగటం మొదటి సారి కాదు. గతంలో ఒంగోలు నగర పాలక సంస్థ ఒంగోలు నగరంలో వేసవి దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేసిన ప్రారంభ ఆహ్వాన ఫ్లెక్సీలలో ఏకంగా ముఖ్యమంత్రి జగన్‌తో పాటుగా ,రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి,జిల్లాకు చెందిన మంత్రి ఆదిమూలపు సురేష్ ఫోటోను ఫ్లెక్సీలలో ముద్రించటం మరిచారు.దీనిపై అప్పట్లో పెద్ద వివాదమే నెలకొంది. ప్రభుత్వ కార్యక్రమంలో ముఖ్యమంత్రి, రాష్ట్ర మంత్రి ఫోటో లేకుండా ఎమ్మెల్యే బాలినేని, ఆతని కుమారుడి ఫోటోలు వేయటం పట్ల తీవ్ర చర్చ జరిగింది.దీంతో తప్పును గమనించిన మున్సిపల్ అధికారులు రాత్రికి రాత్రే ఫ్లెక్సీలను మార్చివేశారు. ఇదే తీరుగా కలెక్టట్ వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను కూడా వెంటనే తొలగించి వాటి స్థానంలో మంత్రి సురేష్, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసులరెడ్డి ఫోటో, ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులరెడ్డి, బాపట్ల ఎంపి నందిగం సురేష్, కలెక్టర్ ఫోటోలతో పాటుగా ఒంగోలు నగర మేయర్ ఫోటోను కూడా ప్రచురించారు. అయితే ప్రభుత్వ కార్యక్రమంలో కేవలం అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ఫోటోలు ముద్రించిన యంత్రాంగం ప్రతిపక్ష పార్టీకి చెందిన ఎమ్మెల్యేలుగాని, ఎమ్మెల్సీ ఫోటోలుగాని ముద్రించలేదు. అయితే ఫ్లెక్సీల తప్పంతా మీడియాదేనని, తాము కరెక్టుగా ముద్రించినా మీడియా తప్పులుగా రాయటం పరిపాటిగా మారుతుందని మీడియాపై అధికార పార్టీ దుమ్మెత్తిపోయటం పరిపాటిగా మారింది. ఒంగోలు నగర పాలక సంస్థ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల సందర్భంగా కూడా మేయర్ దగ్గర నుండి అధికారుల వరకు మీడియాపై దుమ్మెత్తి పోశారు.

వివాహ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే ఉగ్ర

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : మండల పరిధిలోని తిమ్మారెడ్డిపల్లి గ్రామంలో బుధవారం టీడీపీ నాయకులు వేశపోగు సుజ్ఞాన్ వారి కుమార్తె వివాహ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న కనిగిరి టీడీపీ ఇంచార్జ్ మరియు మాజీ ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పాల్గొని పెళ్లి కుమార్తెను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో దళిత నాయకులు

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : మండల పరిధిలోని తిమ్మారెడ్డిపల్లి గ్రామంలో బుధవారం వేశపోగు సుజ్ఞాన్ వారి కుమార్తె వివాహ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న దళిత నాయకులు కత్తి తిరుపాలు, కోలగురు,బలసాని యెహెూషువ,కత్తి అజయ్‌లు పాల్గొని పెళ్లి కుమార్తెను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రైవేటు కార్యక్రమంలో 'ఉగ్ర'

విశాలాంధ్ర-పామూరు : మండలంలోని దాదిరెడ్డిపల్లి తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కల్లూరి తిరుపతయ్య కుమార్తె ఓణీలా పంక్షన్ బుధవారం జరిగింది. కనిగిరి మాజీ శాసనసభ్యులు, తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పాల్గొని ఆశీర్వదించారు. కార్యక్రమంలో పువ్వాడి రామారావు, గుంటుపల్లి శ్రీను పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగులో మహిళా రైతులది బాధ్యతాయుత పాత్ర

విశాలాంధ్ర-తాళ్లూరు : చిరుధాన్యాల సాగులో మహిళా రైతులది బాధ్యతాయుతమైన పాత్ర ఉంటుందని మండల వ్యవసాయ అధికారి బి.ప్రసాద్ రావు అన్నారు. మండల కేంద్రమైన తాళ్లూరులోని వైయస్సార్ వెలుగు కార్యాలయంలో ఎంఎంఎస్ అధ్యక్షురాలు ఎల్ విజయలక్ష్మి అధ్యక్షతన చిరుధాన్యాల సాగుపై మహిళలకు అవగాహన కార్యక్రమం బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి బి ప్రసాద్ రావు మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో మహిళల పాత్ర కీలకమై ఉందని సాగులో సగంభాగం మహిళా రైతులే ఉంటున్నారని ఆయన అన్నారు. మహిళా రైతులను చైతన్యపరిచి ఆరోగ్యకరమైన చిరుధాన్యాల సాగు వైపు వారి దృష్టిని మళ్లించాలని ఆయన తెలిపారు. ఈ క్రమంలో చిరుధాన్యాలకు సంబంధించిన మినీ కిట్లను సక్రమంగా ఉపయోగించి తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయాన్ని పొందగలిగేటట్లుగా చిరుధాన్యాల సాగు ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం పి దేవరాజ్, సీసీ కోటేశ్వరమ్మ, వివో ఏలు, మహిళలు పాల్గొన్నారు.

టీడీపీది బస్సు యాత్ర కాదు శవయాత్ర

- సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ ధ్వజం

విశాలాంధ్ర-ఒంగోలు : టీడీపీ ఇటీవల చేపట్టిన బస్సు యాత్ర శవయాత్ర అని సంతనూతలపాడు ఎమ్మెల్యే టిజెఆర్ సుధాకర్‌బాబు విమర్శించారు. స్థానిక వైసీపీ జిల్లా కార్యాలయంలో సుధాకర్‌బాబు మీడియా సమావేశం నిర్వహించారు. టిజెఆర్ మాట్లాడుతూ పల్లె నిద్ర అంటే వచ్చినటిడిపి నాయకులంతా అక్కడే నిద్రపోవాలని, సంతనూతలపాడు నియోజక వర్గంలోని నందిపాడులో ఎంత మంది టిడిపి నాయకులు నిద్రించారో చెప్పాలని డిమాండ్ చేశారు. టిడిపి బస్సు యాత్ర తూతూ మంత్రంగా సాగిందన్నారు. జులై 1వ తేదీ నుండి రాష్ట్ర వ్యాపితంగా జగనన్న సురక్ష పథకం అమలులోకి రానుందన్నారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలన్నారు. సమన్యాయం పాటిస్తుంది వైసీపీ ప్రభుత్వమే అన్నారు. తాము చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలపై దమ్ముంటే టిడిపి నేతలు చర్చకు రావచ్చని సవాల్ విసిరారు.

బహిరంగ వేలంపాటల ఆదాయం వెల్లడి

విశాలాంధ్ర-సీఎస్‌పురం : బుధవారం దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారుల సమక్షంలో నిర్వహించిన టువంటి బహిరంగ వేలం పాటలకి 16,88,000 వచ్చినట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి నర్రా నారాయణరెడ్డి తెలిపారు. అదేవిధంగా హుండీ లెక్కింపు ద్వారా 2,18,752 వచ్చినట్లు తెలిపారు. మొత్తంగా 19,06,752 వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, ఆలయ కార్య నిర్వహణ అధికారి నర్రా నారాయణరెడ్డి, ఆలయ చైర్మన్ సిద్దు రమణారెడ్డి, సిద్దు వెంకటరెడ్డి, బసిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా శ్రీనివాసరెడ్డి

విశాలాంధ్ర-మార్కాపురం : డివిజన్ కేంద్రమైన మార్కాపురం మండల తహశీల్దార్‌గా ఎస్ శ్రీనివాసరెడ్డి నియమితులయ్యారు. ఈయన బుధవారం సాయంత్రం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.

ప్రతి ఎకరాకు రూ.10వేల ఆర్థికసాయం అందించాలి

- ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.హనుమారెడ్డి

విశాలాంధ్ర - మద్దిపాడు : పంట సాగు చేసే ప్రతి రైతుకు ప్రతి ఎకరానికి రూ 10000 ఆర్థిక సాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డే హనుమారెడ్డి డిమాండ్ చేశారు. తెలంగాణ తరహాలో రాష్ట్రంలో కూడా రైతులకు ఆర్థిక సహాయం అందజేయాలన్నారు. బుదవారం మండలం రాచవారిపాలెం, కీర్తిపాడు, మల్లవరం, గుండ్లపల్లి, దొడ్డవరం తెల్లబాడు నేలటూరు, పెదకొత్తపల్లి, లింగంగుంట, మండవారిపాలెం గ్రామాలలో రైతు సంఘ ప్రతినిధులు పర్యటించారు. పంట సాగు చేసే సమయంలో రైతులకు ఎదురవుతున్న ఇబ్బందులను వారు అడిగి తెలుసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డే హనుమారెడ్డి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన మద్దతు ధరలు పూర్తి అశాస్త్రీయంగా ఉన్నాయన్నారు. ఆ ధరలు కూడా ప్రభుత్వాలు రైతుల నుంచి పంట కొనుగోలు చేయడం లేదన్నారు. దీంతో ఎన్నోవే ప్రయాసల పడి పంట పండించిన రైతులకు గిట్టుబాటు ధర అందక ప్రతి సంవత్సరం నష్టాలే మిగులుతున్నాయన్నారు. ప్రస్తుతం వ్యవసాయం చేసే వారిలో సన్నా చిన్నకారు రైతులు, కౌలు రైతులు అధికంగా ఉన్నారన్నారు. కాలం కలిసి వచ్చి సక్రంగా పంట పడినా కూడా గిట్టుబాటు ధర లభించక పోవడంతో అప్పుల భారం పెరిగిపోయి రైతులు ఆత్మ హత్యలకు పాల్పడుతున్నారు. దేశంలో రాష్ట్రం రైతుల ఆత్మహత్యలో మూడో స్థానంలో ఉందన్నారు. ఆంధ్రప్రదేశ రైతు సంఘం సంఘం రాష్ట్ర సమితి సభ్యులు కె. వీరారెడ్డి మాట్లాడుతూ రెండు ఎకరాలు సాగు చేసే ప్రతి రైతుకు పెట్టుబడి సాయం కింద రూ 20,000 అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు . డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫారసు ప్రకారం ప్రతి రైతుకు విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు ఉచితంగా అంద జేయాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లను పరిష్కారం కోసం దశలవారీగా కార్యచరణను రూపొందించినట్లు పేర్కొన్నారు. దీనిలో భాగంగా జూన్ 26 నుండి ప్రచార కార్యక్రమం జులై 3న గ్రామ సచివాలయ కార్యదర్శులకు వినతి పత్రం అందజేయడం, జులై 10 11 తారీఖులలో మండల కేంద్రాలలో సామూహిక నిరసన దీక్షలు చేపడతామన్నారు. జూలై 17 18 19 తేదీలలో అన్ని నియోజకవర్గ కేంద్రాలలో రౌండ్ టేబుల్ సమావేశాలు ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం రైతు సంఘ రాష్ట్ర కమిటీ సూచన మేరకు ఉద్యమ కార్యచరణ కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో సంతనూతలపాడు నియోజకవర్గ రైతు సంఘం అధ్యక్షులు చెరుకూరి వాసు, సుబాబుల్ -జామాయిలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి తోట్టెంపూడి వెంకట శేషారావు, రైతు సంఘ నాయకులు ఎంసీ వెంకటేశ్వర్లు, గోగినేని వెంకటేశ్వరరావు, పావు లూరి అంజయ్య, ఓగూరి శేషయ్య, మన్నం తిరుపతయ్య కామేపల్లి శేషయ్య మద్దులూరి లక్ష్మయ్య ఆయా గ్రామాల రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

విశాలాంధ్ర-కనిగిరి : తాగు నీటికి, విద్యుత్తు సమస్యలకు శాశ్వత పరిష్కారం ఏర్పాటు చేయనున్నట్లు కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఒకటవ వార్డులో సమస్యా పరిస్కారంలో భాగంగా మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫూర్ పర్యటించారు. వార్డులో డీప్ బోర్ ద్వారా ఇంటింటికి కుళాయి ద్వారా ఉచిత మంచి నీరు కల్పిస్తామని హామీ ఇచ్చారు. లో ఓల్టేజ్ ద్వారా విద్యుత్ అంతరాయం కలుగుతుందని ప్రజలు ఫిర్యాదు చేయగా ఫిర్యాదు మేరకు విద్యుత్ అధికారులు పిలిపించి వార్డులో విద్యుత్ సమస్య తీవ్రంగా ఉందని ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అదనంగా విద్యుత్తు ట్రాన్స్ఫారం ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ అధికారులను కోరగా సానుకూలంగా స్పందించి నూతన విద్యుత్ ట్రాన్స్ఫారం ఏర్పాటు చేయుటకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రామన బోయిన ప్రశాంతి శ్రీనివాస్ యాదవ్ మున్సిపల్ ఏఈ కోటేశ్వర రావు,వర్క్ ఇన్స్పెక్టర్ షరీఫ్ ఉద్దీన్, వైసీపీ నాయకులు కంటూ గురవయ్య పెద్ద రసూల్, హరి, తిరుపాలు, ఈర్ల శ్రీను, నరసింహులు, చిన్నిగారి కొండలు వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లుల నుండి ప్రజలను కాపాడాలి

30వ తేదీన ధర్నా జయప్రదం చేయండి

విశాలాంధ్ర-పామూరు : కరెంటు బిల్లులతో సామాన్య ప్రజలు నడ్డి విరుస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ ఛార్జీల పెంపుదలను ప్రతిఘటించాలని సిపిఐ నాయకులు మౌలాలి, సిపిఎం మండల కార్యదర్శి కే మాల్యాద్రి అన్నారు. వారు మాట్లాడుతూ ప్రజల కళ్ళుగప్పి దొడ్డి దారిన సర్దుబాటు చార్జీలు భారంతో స్మార్ట్ మీటర్లతో మరో ముప్పు ఉందని ప్రజలు గమనించాలని సామాన్యులను దోచి కార్పొరేట్ల జేబులో నింపుతున్న కేంద్ర రాష్ట్ర సర్కార్లకు తగిన బుద్ధి చెప్పాలని డిమాండ్ చేశారు. విద్యుత్ బిల్లును చూడగానే షాక్ గురవుతున్నారని పెరుగు తున్న బిల్లులతో జనం గగ్గోలు పెడుతున్నారని విద్యుత్తు వాడకం పెరగడం లేదు కానీ ఒకేసారి సర్దుబాటు చార్జీలు పేరుతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కుమ్మక్కై ప్రజలపై భారాలు మోపుతున్నారని వెంటనే పెంచిన కరెంటు చార్జింగ్ తగ్గించాలని స్మార్ట్ మీటర్లను ఆపాలని కరెంటు బిల్లు నుండి ప్రజల రక్షించాలని కోరుతూ ఈ నెల 30వ తేదీన జరిగే ధర్నాలో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని సిపిఐ కార్యాలయం నందు ఉమ్మడి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సిపిఎం మండల కార్యదర్శి కోమలపాటి మాల్యాద్రి అధ్యక్షత వహించారు. ఈ కార్య క్రమంలో పి.మస్తాన్రావు వి సుబ్బారావు, ఇర్రి రమణారెడ్డి, మహదేవయ్య, కరిముల్లా, షేక్ అల్లా బక్షు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ సామాజిక భవనానికి స్థలం ఇవ్వాలి

దళిత సంఘాల ఆధ్వర్యంలో రిలే దీక్షల పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-మార్కాపురం : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సామాజిక భవనానికి స్థలాన్ని కేటాయించాలని స్థానిక సిపిఐ కార్యాలయంలో రిలే దీక్షల కరపత్రాన్ని, నియోజవర్గర్ సిపిఐ అందె నాసరయ్య, బహుజన సైన్యం అధ్యక్షులు జనుమాల నాగయ్య, బిఎస్పీ నియోజకవర్గ ఇన్చార్జ్ సంద్రపాటి కాలేబులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బహుజన సైన్యం అధ్యక్షులు జనుమాల నాగయ్య మాట్లాడుతూ మార్కాపురం డివిజన్ కేంద్రంలో రాజ్యాంగ నిర్మాత, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సామాజిక భవనానికి స్థలం కేటాయించలేకపోవడం పట్ల ఈ ప్రభుత్వానికి దళితులపై ఉన్న చిత్తశుద్ధి ఏంటో అర్థమవు తుందని విమర్శించారు. ఎన్నో సంవత్సరాలుగా సామాజిక భవనం కోసం ఎన్నో పోరాటాలు, రిలే దీక్షలు, ఆమరణ నిరాహార దీక్షలు చేసినప్పటికి బూడిద లో పోసిన పన్నీరు వలె ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఐ కార్యదర్శి అందే నాసరయ్య మాట్లాడుతూ మార్కాపురం పట్టణంలో అంబేద్కర్ కు స్థలం కేటాయించలేకపోవడం చాలా దుర్మార్గమని అన్నారు. బిఎస్పి నియోజకవర్గ ఇంచార్జ్ సంద్రపాటి కాలేబు మాట్లాడుతూ మార్కాపురంలో చేపల మార్కెట్‌కు, కూరగాయల మార్కెట్‌కు, ఆవుల గోశాలకు, స్థలాలు దొరుకుతున్నాయని, అయితే భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సామాజిక భవనానికి స్థలం కేటాయించడానికి పాలకులకు మనసు ఎందుకు రావడం లేదోని ప్రశ్నించారు. అంబేద్కర్ సామాజిక భవనానికి కై జులై మూడవ తేదీన మార్కాపురం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదురు రిలే దీక్షలు చేపడుతున్నామని దానికి అన్ని కుల సంఘాలు, దళిత సంఘాలు, ప్రజాసంఘాలు, అధిక సంఖ్యలో పాల్గొని రిలే దీక్షలకు మద్దతును అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎనిబెరకిషోర్, గురవయ్య, నూతలపాటి రాజు,కుమార్, రామాంజనేయులు చినబాబు,తిమోతి, చెన్న కేశవులు, నాసరయ్య పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీ పద్మావతి వార్షికోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-ముండ్లమూరు : మండలంలోని పెదవులగల్లు గ్రామంలో శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి 16వ వార్షికోత్సవ వేడుకలు బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం 12:00 25 నిమిషాలకు చిత్త నక్షత్ర యుక్త కన్యా లగ్న పుష్ప ఖాంశము శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి కళ్యాణం జరిగినది. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి స్వామివారి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు స్వామి వారి తీర్థ ప్రసాదములు స్వీకరించారు. భక్తులు అర్చక స్వాములను సంప్రదించి పూజలు చేశారు. సాయంత్రం మంగళ వాయిద్యాలతో తోరణం కట్టుట, విసక్షేన ఆరాధన, పుణ్య హావాచకం, రక్షాబంధనం, మేదిని పూజ, అంకురారోపణ, అఖండ దీపారాధన, మండపా రాధన, తీర్థప్రసాదాలు వినియోగించారు. అనంతరం స్వామివారి కళ్యాణ మహోత్సవానికి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ పూజారి పరాశరం నరసింహమూర్తి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం స్వామివారిని ప్రధాన వీధులలో ఊరేగింపు నిర్వహించారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేత

విశాలాంధ్ర-తర్లుపాడు : తర్లుపాడు మండలం కలుజువ్వలపాడు పంచాయతీలోని మేకలవారి పల్లిలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 45 మంది విద్యార్థిని, విద్యార్థులకు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.వి జగన్‌బాబు ఒక్కొక్కరికి నాలుగు నోటు పుస్తకాలు, ఒక పెన్ను చొప్పున సుమారుమూడు వేల రూపాయలు విలువచేసే విద్యా సామాగ్రిని ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు.

గురవయ్య కుటుంబాన్ని వెంటాడుతున్న లివర్ వ్యాధి

విశాలాంధ్ర-తర్లుపాడు : ఇద్దరు అబ్బాయిలు, ఒక కుమార్తెతో ఎంతో ఆనందంగా కొనసాగుతున్న సాదాసీదా కుటుంబం. ఇలాంటి కుటుంబాన్ని లివర్ వ్యాధి అనే మహమ్మారికి ఆ కుటుంబంపై కన్ను పడింది. వారు ఎవరో కాదు తర్లుపాడు మండలం, మీర్జా పేట గ్రామంలో నివసిస్తున్న రాజారపు గురవయ్య, భూలక్ష్మిల సంతానమే ఇద్దరు మగ పిల్లలు ఒక అమ్మాయి కాగా ఇటీవల గురవయ్య ఇద్దరు కుమారులకు, కుమార్తెకు లివర్ వ్యాధి సోకింది. దీంతో గురవయ్య ఎన్నారై హాస్పిటల్లో, చెన్నైలోని రియల్ హాస్పిటల్‌లో చికిత్సలు పొందుతున్నారు. వీరికి సోకిన వ్యాధిపై వైద్యులకు వచ్చిన అనుమానాల ప్రకారం జెనెటిక్ పరంగా పరీక్ష నిర్వహించారు. దీంతో వారికి కేవలం లివర్ వ్యాధి వారిని పీడిస్తుందని నిర్ధారణ తేలింది. ఇప్పటికే రెండవ కుమారుడు కేతన్ లివర్ వ్యాధితో ఏడాది క్రితం చనిపోవడం జరిగింది. పెద్ద కుమారుడు ప్రస్తుతం ట్రీట్మెంట్‌లో ఉన్నాడు. కుమార్తె అయిన తనుశ్రీకి వాంతులు కాగానే వెంటనే ఎన్నారైకి తీసుకెళ్లి వైద్యులకు చూపించినప్పటికీ ప్రయోజనం లేక రాత్రి చనిపోవడం జరిగింది. ఇప్పటికే గురవయ్య అప్పు చేసి సుమారు 40 లక్షల రూపాయలు పిల్లల వైద్యం కోసం ఖర్చు పెట్టాడు అయినా ఫలితం లేకపోవడంతో ఆ కుటుంబం వీధిన పడింది. ఉన్న ఒక్క పెద్దఅబ్బాయి కూడా బ్రతుకుతాడా లేదా అని ఆందోళన చెందుతున్నారు. మెరుగైన వైద్యం చేయించుకోవడానికి ఆర్థికంగా చితికిపోయారు. ఇప్పటికే అప్పుల పాలై పోయామని తల్లిదండ్రులు శోకసముద్రంలో మునిగిపోయారు. వీరికుటుంబాన్ని ఆదుకునేందుకు ఏ ప్రభుత్వము సహాయం చేయకపోవడం చాలా బాధాకరంగా ఉందని చూపరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రాజకీయ నాయకులు వైశమ్యాలు వదిలిపెట్టి రాష్ట్ర ముఖ్యమంత్రి తలపెట్టిన ఆశయాలకు అనుగుణంగా ఆ పేద కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

విత్తన విక్రయ దుకాణాల ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-తాళ్లూరు : మండల వ్యవసాయ అధికారి బి. ప్రసాద్ రావు బుధవారం తూర్పు గంగవరం గ్రామంలో విత్తన విక్రయ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఆయన గ్రామంలోని శ్రీ శ్రీనివాస ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణాన్ని పరిశీలించి బిపిటి 5204 రకం విత్తనాలను శాంపిళ్లను సేకరించి పరిశీలన కొరకు అమరావతిలోని రీజనల్ డీకోడింగ్ సెంటర్‌కు తరలించారు. అనంతరం షాపులోని విత్తనాల స్టాకును, వాటికి సంబంధించిన రసీదులను, బిల్లు పుస్తకాలను పరిశీలిం చారు. ఆయన మాట్లాడుతూ రైతులకు విత్తనాలు అమ్మే డీలర్లు నాణ్యమైన విత్తనాలను మాత్రమే అమ్మాలని వాటిలో ఏమైనా లోపాలు ఉన్నట్లయితే అలాంటి షాపులను సీజ్ చేయడంతో పాటు విత్తన కంపెనీ చట్టం ప్రకారం కోర్టులో కేసు వేయడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. డీలర్లు రైతులకు నాణ్యమైన విత్తనాలు ఇవ్వడంతో పాటు వారి సంతకంతో రసీదులను తీసుకోవాలని లేనట్లయితే చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ నాగరాజు, దుకాణ యజమానులు, సిబ్బంది పాల్గొన్నారు.

త్యాగాలకు ప్రతీక బక్రీద్

పండుగ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి సురేష్

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని ముస్లిం సోదరులందరికీ రాష్ట్ర పుర పాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ శుభాకాంక్షలు తెలిపారు. బక్రీద్ పండుగ ఎంతో ప్రాముఖ్యత కలిగిందని చెప్పారు. ఈ పండుగను ప్రత్యేక ప్రార్ధనలు, భక్తి భావాలతో జరుపుకుంటారన్నారు. బక్రీద్ పండుగ త్యాగనిరతి, అల్లా పట్ల సంపూర్ణ భక్తి, విశ్వాసం, పేదల పట్ల కరుణ, దాతృత్వానికి ప్రతీకగా నిలుస్తుందని చెప్పారు. అవసరంలో ఉన్న వారికి సాయం చేయడం, భక్తి భావంతో అన్ని పంచుకోవడం వంటి ఎన్నో గొప్ప లక్షణాలను బక్రీద్ పండుగ సూచిస్తుందని మంత్రి సురేష్ చెప్పారు. ముస్లిం ప్రజలంతా సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. బక్రీద్‌ను ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలని కోరారు.

ఎస్సైకి ప్రసంసాపత్రాన్ని అందజేసిన ఎస్పీ

విశాలాంధ్ర-పుల్లలచెరువు : పుల్లల చెరువు మండల పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ వై.శ్రీహరి, సిబ్బందిని జిల్లా ఎస్పీ మల్లిక గర్గ్ బుధవారం అభినందించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదుకాబడిన పలు కేసుల్ని త్వరితగతిన దర్యాప్తు చేసి, యుఐ కేసులు తగ్గించినందుకు గాను ఎస్సై శ్రీహరిని ఎస్పీ మల్లికాగార్గ్ అభినందించి ప్రసంసాపత్రాన్ని అందజేశారు. మార్కాపురం డివిజన్ ట్రైనీ ఐపీఎస్ అంకిత సురానా, ఏ.ఎస్పీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

జిల్లాను అన్ని విధాల అభివృద్ధి చేయాలి

జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగు నాగార్జున

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆలోచన స్ఫూర్తితో స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో జిల్లాను అన్ని విధాల అభివృద్ధి చేసేలా అధికారులు పనిచేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రివర్యులు, జిల్లా ఇన్చార్జి మంత్రి మేరుగు నాగార్జున పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం చైర్మన్ శ్రీమతి బూచేపల్లి వెంకాయమ్మ అధ్యక్షతన స్థానిక పాత జడ్పీ సమావేశ మందిరంలో జరిగింది. రాష్ట్ర పురపాలక మరియు పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, జిల్లా కలెక్టర్ ఏ.ఎస్. దినేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ కె శ్రీనివాసులు, బాపట్ల జాయింట్ కలెక్టర్ సిహెచ్. శ్రీధర్ పాల్గొన్న ఈ సమావేశంలో విద్య, గృహ నిర్మాణం, విద్యుత్, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అంశాలపై చర్చించారు. ఆయా అంశాలపై శాసనసభ సభ్యులు, శాసనమండలి సభ్యులు, జడ్పీటీ.సి.లు, ఎం.పి.పి.లు ప్రస్తావించిన పలు సమస్యలపై అధికారులు స్పందించారు. ఈ సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని మంత్రి మేరుగు నాగార్జున అధికారులను ఆదేశించారు. అధికారులు జవాబుదారీతనంతో పనిచేయాలని ఆయన స్పష్టం చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు గుర్తించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. తమ పరిధిలో లేని అంశాలైతే ఉన్నత స్థాయి అధికారుల దృష్టికి, రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలని సూచించారు. మంత్రి సురేష్ మాట్లాడుతూ స్థానికంగా చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తయ్యేలా పర్యవేక్షించడంతోపాటు సంబంధిత బిల్లులను వెంటనే సి.ఎఫ్.ఎం.ఎస్.లో అప్లోడ్ చేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల భూములు అన్యాక్రాంతం కాకుండా పర్యవేక్షించాలని ప్రహరీ గోడలు నిర్మించాలని చెప్పారు. ఆ భూములకు సంబంధించిన వివరాలను డిజిటలైజ్ చేయాలని సూచించారు. ఈ దిశగా ప్రత్యేక సాఫ్ట్వేర్ కూడా తయారు చేసేలా చూస్తామని తెలిపారు. స్కూల్ బయట నోటీసు బోర్డులో కూడా ఆ స్కూలుకు సంబంధించిన భూముల వివరాలను వెల్లడించాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల సంఖ్యను బట్టి టీచర్ పోస్టులను భర్తీ చేసేలా త్వరలోనే జిల్లా విద్యాధికారితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తామని చెప్పారు. రూఫ్ లెవల్ వరకు వచ్చిన ప్రభుత్వ ప్రాధాన్య భవనాలను సెప్టెంబరు నెలాఖరు నాటికి పూర్తి చేసేలా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ఈ దిశగా అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని దిశానిర్దేశం చేశారు. మండల స్థాయిలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలకు ప్రొటోకాల్ ప్రకారం స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని ఆయన స్పష్టం చేశారు. తమను అగౌరవపరుస్తున్నట్లు స్థానిక ప్రజాప్రతినిధుల నుండి ఫిర్యాదులు వస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. హౌసింగ్ పథకంలో చేపట్టిన నిర్మాణాలు కూడా త్వరగా పూర్తయ్యేలా ప్రజాప్రతినిధుల సహకారంతో పర్యవేక్షించాలని కలెక్టర్ పునరుద్ఘాటించారు. జడ్పీ చైర్ పర్సన్ శ్రీమతి బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు ప్రస్తావించిన సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. -జడీ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు కూడా త్వరగా పకారయ్యేలా పర్యవేక్షించాలని ఆమె సూచించారు. గిద్దలూరు ఎం.ఎల్.ఏ. అన్నా వెంకట రాంబాబు మాట్లాడుతూ కొమరోలు మండలం నల్లగుంట్లలో గతంలో హైస్కూలు ఉండేదని, నేడు విద్యా సంవత్సరం ప్రారంభమైనా స్థానికులకు ఎలాంటి పాఠశాల అందుబాటులో లేదన్నారు. విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని వారికి ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా బేస్తవారిపేట హైస్కూలుకు కూడా కాంపౌండ్ వాల్ నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై డి.ఈ.ఓ. రమేష్ మాట్లాడుతూ నల్లగుంట్లలో పాఠశాల అవసరంపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. ఎం.ఎల్.ఏ. మానుగుంట మహీధర్ రెడ్డి మట్లాడుతూ కందుకూరు నియోజకవర్గంలో నాడు - నేడు పథకంలో చేపట్టిన పనులకు సంబంధించిన వివరాలను, ఆయా పాఠశాలల కోసం దాతలు ఇచ్చిన భూముల వివరాలను నెల్లూరు జిల్లా అధికారులకు కూడా ఇవ్వాలని కోరారు. పాఠశాలలు భూముల చుట్టూ ప్రహరీ గోడలు నిర్మించడానికి ముందుగానే సరిహద్దులను నిర్ధారించేలా రెవెన్యూ సిబ్బందితో సర్వే చేయించాలని సూచించారు. ప్రమాదకర స్థితిలో ఉన్న విద్యుత్ స్థంభాలను సత్వరమే తొలగించి కొత్తవి ఏర్పాటు చేయాలని చెప్పారు. దెబ్బతిన్న 3- ఫేజ్ కండక్టర్లు, వైర్లను కూడా తొలగించి ప్రజలకు మెరుగైన విద్యుత్ సరఫరా అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. చీరాల ఎం.ఎల్.ఏ. కరణం బలరామ కృష్ణమూర్తి మాట్లాడుతూ సంక్షేమంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలకు కూడా రాష్ట్ర ప్రభుత్వం అధికంగా నిధులు కేటాయిస్తున్నందువ ఆయా పనులు త్వరగా పూర్తయ్యేలా అధికారులు జవాబుదారీతనంతో పనిచేయాలని అన్నారు. పట్టభద్రులు ఎం.ఎల్.సి. కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ జడ్పీటీ.సి.లకు మండల కేంద్రాలలో కార్యాలయాల నిర్మాణం త్వరగా పూర్తయ్యేలా చూడాలని అధికారులను కోరారు. సుదీర్ఘకాలంగా ఈ డిమాండ్ పెండింగ్లో ఉందన్నారు. కాగా, చీముకుర్తి జడ్పీ టి.సి. వేమా శ్రీనివాస్ మాట్లాడుతూ గత సమావేశంలో ఈ అంశంపై చర్చించి నిధులు కూడా కేటాయించడంతో నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. అయితే కొన్ని చోట్ల కోర్టు కేసుల వల్ల ఎం.పి.డి.ఓ. కార్యాలయాలలో జడ్పీ టి.సి.లకు ప్రత్యేక గదులు నిర్మించలేక పోతున్నామని, అలాంటి చోట్ల ప్రత్యామ్నాయ స్థలాలను కేటాయించాలని జడ్పీ చైర్పర్సన్ను కోరారు. టీచర్ ఎం.ఎల్.సి. పి. చంద్ర శేఖర్ రెడ్డి మాట్లాడుతూ విద్యా రంగ అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నందున ప్రభుత్వ పాఠశాలలలో మెరుగైన ఫలితాలు రాబట్టేలా ఇప్పటి నుంచే ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను కోరారు. మాజీ ఎం.ఎల్.ఏ. బూచేపల్లి శివప్రసాద రెడ్డి మాట్లాడుతూ కాలిపోయిన ట్రాన్స్ఫార్మర్లను 48 గంటలలోగా మార్చాలని నిబంధనలు ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో అధికారులు ఆ మేరకు పనిచేయడం లేదని అసహనం వ్యక్తం చేశారు.వీటిని సత్వరమే మార్చేలా పర్యవేక్షించాలని అధికారులను కోరాడు. జిల్లాలో మొత్తం 71 ఏ.ఈ.ఈ. పోస్టులకు గాను 38 ఖాళీలు ఉన్నాయని అధికారులు చెప్పగా, వాటిని భర్తీ చేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని ఆయన కోరారు. యర్రగొండపాలెం, త్రిపురాంతకం బడ్పీటీ.సి.లు, కొమరోలు, దొనకొండ ఎం.పి.పి.లు మాట్లాడుతూ తమ ప్రాంతంలోని పాఠశాలలకు సంబంధించిన సమస్యలను, విద్యుత్ సమస్యలను ప్రస్తావించారు. కొండపి బర్పీటీ.సి. మాట్లాడుతూ కందుకూరులో ఉన్న ఈ.ఈ. కార్యాలయం నెల్లూరు జిల్లాలోకి వెళ్లినందున కొండపిలో ప్రత్యేకంగా కార్యాలయం ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సి.ఎస్.పురం ఎం.పి.పి. మాట్లాడుతూ తమ ప్రాంతంలో రెగ్యులర్ ఏ.ఈ. ఈ. లేకపోవడం వలన ఇన్చార్జిని నియమించారన్నారు.